పన్ను కట్టని బండికి బ్రేకులు!

పన్నులు కట్టకుండా కొందరు వాహనదారులు ఎగవేస్తున్నారు. ఈ బండి ఎవరు పట్టుకుంటారులే అన్న ధీమాతో రోడ్డెక్కుతున్నారు. అటువంటి వాహనాలపై కొరడా ఝుళిపించేందుకు రవాణాశాఖ సిద్ధమైంది. వాహనాన్ని బట్టి మూడు నెలలు, ఆరు నెలలు, వార్షికంగా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో త్రైమాసిక పన్ను ఎగవేతదారుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర రవాణాశాఖ అధికారులు వాహనాల పన్ను చెల్లింపులపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. పన్ను చెల్లించని వాహనాలకు ఎక్కడికక్కడే బ్రేకులు వేస్తున్నారు.

- వాహనాలపై రవాణాశాఖ కొరడా
- పన్ను చెల్లించని వారికి నోటీసులు జారీ
- ఈనెలాఖరుకి పన్ను చెల్లించేలా యజమానులకు ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్



వాహనాన్ని తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా పన్ను చెల్లించని వివిధ రకాల వాహనాలు 1,047 ఉన్నట్లు రవాణా అధికారులు లెక్కలు తేల్చారు. త్రైమాసిక పన్ను పెండింగ్ ఉన్న వాహనాల యజమానులకు రవాణాశాఖ సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్, ఇళ్లకు నోటీసులు పంపిస్తోంది. ఫిబ్రవరి నెలాఖరులోపు వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్ను పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంది. ఒక వేళ వాహనం ప్రమాదంతో తుక్కుగా మారి ఉన్నా, కాలం తీరిన వాహనాలను తుక్కు కింద మార్చేసి ఉన్నట్లు అయితే వాహనాలకు సంబంధించిన వివరాలను యజమానులు సమీపంలోని రవాణా కార్యాలయంలో అధికారులకు అందజేయాల్సి ఉంది. తుక్కుగా పరిగణించిన వాహనాలకు సంబంధించి ఆ వాహనం ఎక్కడా తిరగడం లేదని ఆ గ్రామ, వార్డు వీఆర్వోతో ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ వివరాలను గడువులోపు ఇవ్వాలని లేకుంటే ఆ తర్వాత తుక్కు వాహనాలకు సైతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

సీజ్..ఇలా..

పన్ను పెండింగ్‌లో ఉన్న వాహనాలు అధికారుల తనిఖీల్లో పట్టు బడితే రెట్టింపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. స్వచ్ఛందంగా చెల్లించడానికి ముందుకొస్తే, వాహన పన్నుతోపాటు 50 శాతం పెనాల్టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అదే అధికారుల తనిఖీల్లో పట్టుబడితే పన్నుకు 200 శాతం పెనాల్టీతో వసూలు చేయనున్నారు. దీంతో పాటు ఆ వాహనాన్ని సీజ్ చేసి కోర్టులో ప్రాసిక్యూషన్ చేయనున్నారు. ఎక్కువగా ట్రాక్టర్లకు సంబంధించి ట్రైలర్‌ను ఇతరులను కొనుగోలు చేసి వాటిని తన పేరు మీద మార్చుకోనివారి సంఖ్య అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటివి బకాయిలు చూపిస్తున్నట్లు చెబుతున్నారు. రాయితీల మీద వాహనాలను కొనుగోలు చేసిన యజమానులు కూడా ఇప్పటి వరకు ఒక పైసా పన్ను చెల్లించడం లేదని గుర్తించారు. వీరంతా గడువులోపు పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ పన్ను వసూళ్లకు జిల్లాలోని ఎంవీఐలను బృందాలుగా ఏర్పాటు చేసి గడువులోపు పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు పట్టుపడుతున్నారు.

వాహన గణాంకాలు

త్రైమాసిక పన్ను చెల్లించని వివిధ రకాల వాహనాలు జిల్లాలో ఎన్ని ఉన్నాయో రవాణా అధికారులు లెక్కింపులు చేపట్టారు. మొత్తం 1,047 వాహనాలు ఉండగా అందులో లారీలు 290, కమర్షియల్ ట్రాక్టర్స్ 300, మాక్సీ క్యాబ్‌లు 40, లైట్ గూడ్స్ వెహికల్స్ 75, స్కూల్ బస్సులు 12, సీసీ బస్సులు 3, మిగిలిన వాహనాలు ఒకటి చొప్పున ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గత 10 రోజులుగా చేపట్టిన డ్రైవ్‌లో 498 వాహనాలకు రూ.25 లక్షల పన్నులు వసూలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన వాహనాలకు సంబంధించి సుమారు రూ.20 లక్షల వరకు పన్ను వసూలు చేయాల్సి ఉంది. గడువులోపు పన్ను వసూళ్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలందాయి.

పన్ను కట్టడం బాధ్యతగా తీసుకోవాలి

వాహనదారులు పన్ను కట్టకపోతే ఏం కాదనే భ్రమ నుంచి బయటపడాలి. బాధ్యతగా పన్ను చెల్లించాల్సి ఉంది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇది వరకు పన్ను చెల్లించని వ్యక్తులు త్వరగా చెల్లించాల్సి ఉంది. లేనిపక్షంలో చర్యలు తప్పవు.

– బసిరెడ్డి, డీటీసీ, చిత్తూరు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పూతలపట్టు: మండలంలోని వరదయ్యపాలెం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనునట్లు మిషన్ ఫర్ విజన్ సంస్థ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. చెన్నై శంకరనేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్యం, రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు ఉచిత కంటి అద్దాలు, తగిన మందులు అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9059592200ను సంప్రదించాలని కోరారు.

మొదలియార్ వివాహ పరిచయ వేదిక

చిత్తూరు రూరల్: మొదలియార్ సంఘం చిత్తూరు నగరంలో ఆదివారం మొదలియార్ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. దీనికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సహదేవన్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న పీడీఎఫ్ నామినేషన్లు

పుత్తూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ప్రోగ్రెస్సీవ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థులు ఈ నెల 22న నామినేషన్లు వేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అనుబంధ సంఘాలైన యూటీఎఫ్, ఎస్టీయూ, బిల్డింగ్ వర్కర్స్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పోకిరెడ్డి బాబురెడ్డి చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు వేస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచే వినతులు స్వీకరిస్తామని చెప్పారు. నగరంలోని వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 –5 గంటల మధ్య ప్రజలు వినతులు అందచేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఇంటినుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్: 08572–232745, వాట్సప్–9849907885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆమె పేర్కొన్నారు.

అందుబాటులోకి ఎన్‌హెచ్ అంబులెన్స్



పూతలపట్టు: మండలంలోని తేనేపల్లి హైవే టోల్‌ప్లాజా వద్ద కేంద్ర ప్రభుత్వం (నేషనల్ హైవే వారు) ఎన్‌హెచ్ అంబులెన్సును ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగితే 1033కు కాల్ చేస్తే అంబులెన్సు సేవలు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ అంబులెన్సు టోల్ ప్లాజా నుంచి 25 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడ ప్రమాదం జరిగినా సేవలందిస్తుందని డ్రైవర్ ప్రసన్న కుమార్ తెలిపారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

చిత్తూరు కార్పొరేషన్: దేశ భవిష్యతు కాంగ్రెస్‌తో సాధ్యమని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు తెలిపారు. ఆదివారం చిత్తూరులోని ఆ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర విజయవంతమైందన్నారు. బీజేపీ కులాల మధ్య చిచ్చుపెడుతూ దేశాన్ని నాశనం చేస్తోందన్నారు. ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకులు మేయప్పన్ మాట్లాడుతూ ముస్లిం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందన్నారు. భవిష్యతులో వామపక్షాలతో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న బీజేపీని రాష్ట్ర ప్రజలు ఎందుకు ఆదరించాలన్నారు. త్వరలో రాహుల్‌గాంధీ మరో పాదయాత్ర ప్రారంభించనున్నరని తెలిపారు. పార్టీ నాయకులు రాకేష్ రెడ్డి, గౌతం, భాస్కర్, టిక్కీరావ్, వెంకటేష్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మొరంపల్లెలో ఎడ్ల పందేల కోలాహలం


జనసమూహంలో దూసుకెళ్తున్న గిత్త

బైరాల: మండలంలోని మొరంపల్లెలో ఆదివారం కోలహలంగా ఎద్దుల పోటీలను గ్రామస్తులు అట్టహాసంగా నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి ఎద్దులను తీసుకొచ్చారు. గోవులను, ఎద్దులను శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూల మాలలు, రంగు కాగితాలు, గిత్తల కొమ్ములకు పట్టీలు కట్టి, గాలి బుడగలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ముస్తాబు చేసిన కోడెగిత్తలను, ఎద్దులను జనసమూహం వైపు వదిలిపెట్టారు. అవి రంకెలేస్తూ కొన్ని యజమానులను అనుసరిస్తూ, కొన్ని పరుగులు తీస్తూ ముందుకు సాగాయి. పట్టీల కోసం యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. పట్టీలను దక్కించుకున్న యువకులు విజయోత్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం హాజరు కావడంతో గ్రామంలో పండగ వాతవరణం నెలకొంది.


దూసుకెళుతున్న ఎద్దులు

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా సరితారెడ్డి


సరితారెడ్డిని శాలువతో సత్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తవణంపల్లె: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా జొన్నగురకల పంచాయతీ సర్పంచ్ సరితారెడ్డిని ఆదివారం చిత్తూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. అనంతరం సరితారెడ్డి దంపతులను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు గాంధీబాబు, సురేష్‌బాబురెడ్డి, పార్టీ నాయకులు ప్రకాష్‌బాబురెడ్డి, సుకేష్‌రెడ్డి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం(యాదమరి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం నుంచే భక్తులు తరలిరావడంతో ఆలయంలోని క్యూలన్నీ నిండిపోయాయి. వీఐపీలతోపాటు సామాన్య భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో మయానసేవ ఉత్సవం


దుర్గాలమ్మకు అమావాస్య పూజలు


బొమ్మసముద్రంలో తీర్చిదిద్దిన రుద్రుడి ప్రతిమ

గుడిపాల: భక్తిశ్రద్ధలతో మయానసేవ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో ఆదివారం అంకాలపరమేశ్వరి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. మూలస్థానంలో ఉన్న అమ్మవారికి అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం అమ్మవారిని ఊరేగించారు. అనంతరం శ్మశానంలో రుద్రుడిని మట్టితో తీర్చిదిద్దారు. బొమ్మసముద్రంలో ఉన్న దుర్గాలమ్మ దేవాలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. మహిళలు పిండివంటలను రుద్రుడికి నైవేద్యంగా సమర్పించారు. నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద భద్రకాళమ్మ ఆలయంలో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు.


ఊరేగుతున్న అంకాలపరమేశ్వరి

వైభవం.. మహా కుంభాభిషేకం

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, రజతోత్సవ సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల బృందం ఉదయం గణపతిపూజ, కలశస్థాపన, హోమ పూజలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రాణప్రతిష్ట చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మహాకుంభాభిషేకం వేడుకల్లో పాల్గొని, ఉమామహేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. పెనుమూరు వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు వేలు మొదలియార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమ, వైస్ ఎంపీపీ హరిబాబు, ఆర్బీకే సలహామండలి బోర్డు చైర్మన్ బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మపై ఆదిదంపతుల విహారం

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు ఆదివారం ఉదయం ఆది దంపతులైన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి కైలాసగిరి రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. శ్రీస్వామి, అమ్మవారి మూల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో స్వామి, అమ్మ వారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి కై లాసగిరి రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీర్చారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవానికి పలమనేరు పట్టణానికి చెందిన సుధారాణి, వెంకటరెడ్డి ఉభయ దారులుగా వ్యవహరించారు. రాత్రి శేష వాహనంపై స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమానికి బంగారుపాళెం మండలం కొండేటి వాండ్లపూరుకు చెందిన సుమతి, రంగనాథంనాయుడు ఉభయదారులుగా వ్యవ హరించారు. జబర్దస్త్ ఫేమ్ కామెడీ యాక్టర్ సుధాకర్ మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

వృషభవాహనంపై శివయ్య

లింగోద్భవ దర్శనం అనంతరం పార్వతీ పరమేశ్వరుడు వృషభవాహనాన్ని అధిరోహించి భక్త జనులను కనువిందు చేశారు. ఈ సేవకు జమిందారు సుబ్బరామరాజా వారి కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈఓ మునిరాజ , వంశపారంప ర్య ధర్మకర్త విజయకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు రెడ్డెప్ప గురుకుల్, అర్చకులు విశ్వనాథ గురుకుల్, దండపాణి గురుకుల్, సోమశేఖర్‌గురుకుల్, హరికేష్, హర్ష, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మొగిలిలో రావణబ్రహ్మవాహనంపై ఆది దంపతులు

నేడు గజవాహన సేవ

మొగిలీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం గజవాహనం, రాత్రి కామధేను వాహన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

శివరాత్రి వేడుకల్లో వీధి నాటకం

పూతలపట్టు: శివరాత్రి వేడుకల్లో భాగంగా వీధి నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండలంలోని తలపులపల్లె, వడ్డేపల్లె గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా తిరుపతి అంకుర సంస్థ వాళ్లు 'వారణావతం' వీధి నాటకం ప్రదర్శించారు. దీనికి పెనుగొండ పరిశీలకులు తలపుల పల్లి బాబురెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జానపద కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. నాటకాలు అంతరించిపోకుండా మనమే వాటిని అభినందించాలన్నారు. అనంతరం అంకుర సంస్థ చైర్మన్ కృష్ణయ్య వీధి నాటకాలు వేసిన కళాకారులకు నగదు అందజేశారు.


వృషభ వాహనంపై ఊరేగుతున్న మణికంఠేశ్వరుడు

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం

తవణంపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో ఆదివారం శ్రీ కాళభైరేశ్వర ఆలయంలో వేదమంత్రాలు నడుమ నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపండితులు శివపార్వతులకు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనికి చిగరాకులపల్లె నందనూరు వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శివపార్వతులు

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అశ్వ వాహనంపై శివపార్వతులు విహరించి భక్తులకు కనువిందు చేశారు. అశ్వవాహనంపై కొలువైన శివపార్వతులకు అర్చకులు అభిషేకం , పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం శివపార్వతులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు. దీనికి చింతమాకులపల్లె లక్ష్మీ, సరస్వతి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రావణబ్రహ్మ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను వృషభవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

యాళి వాహనంపై ..

యాదమరి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ ఏకాంబరేశ్వర స్వామి ఆదివారం ఉదయం యాళీ,రాత్రి నెమలి వాహనంపై ఊరేగారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.


వృషభ వాహనంపై పార్వతీ పరమేశ్వరులు


మొగిలీశ్వరుని సేవలో జబర్దస్త్ ఫేమ్ సుధాకర్


పూతలపట్టు: నాటక కళాకారులతో నాయకులు తలపులపల్లి బాబురెడ్డి




బంగారుపాళెం : శేషవాహనంపై పార్వతీ పరమేశ్వరులు, అశ్వవాహనంపై విహరిస్తున్న శివపార్వతులు




తవణంపల్లె కాళభైరేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం, హాజరైన భక్తులు